క్లుప్తంగా

క్షీరాభిషేకం



సంగెం : జీఎస్టీ తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడాన్ని హర్షిస్తూ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సపావట్ మహేందర్ మాట్లాడారు. ప్రధాని మోదీ అములు చేస్తున్న పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని నాయకులను, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మెట్టుపల్లి నర్సయ్య, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, నాయకులు వడ్డి దేవేందర్‌రెడ్డి, లింగాల శ్రీనివాస్‌రెడ్డి, పైడి, ముకుందం, వీరయ్య, వెంకన్న, సాయి కుమార్, రమేష్, యాకూబ్, స్వామి, రాంబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నర్సంపేట : ప్రైవేటు పీఈటీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వజ్జ రాజేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు పట్టణంలోని గీతాంజలి డీజీ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా ప్రైవేటు వ్యాయామ విద్య, ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయనకు జిల్లా అధ్యక్షుడు పరికి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి యాట రవికుమార్, కోశాధికారి కరాటే భవాని చంద్ వజ్జ రాజేశ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడారు. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. క్రీడాకారుల, క్రీడారంగ అభివృద్ధికి పాటు పడతామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇటుకాల దేవేందర్, కందకట్ల సతీశ్, ఇరుగడుదిండ్ల వెంకటరత్నం, సహాయ కార్యదర్శులు ఓరుగంటి మహేశ్, కుంట విజేందర్ యాదవ్, ఉరుసుల శేఖర్ యాదవ్, సాంస్కృతిక కార్యదర్శి పుల్లూరి సుమన్ గౌడ్, మీడియా కార్యదర్శి సిరపురపు మహేశ్, సభ్యులు మహ్మద్ రియాజుద్దీన్, దుగ్గి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



రాణి (ఫైల్)

గీసుకొండ : మండలంలోని మరియపురం గ్రామానికి చెందిన వివాహిత కొత్త రాణి అదృశ్యమైంది. ఆమె భర్త మొగిలి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మహేందర్ మీడియాకు వెల్లడించారు. ఆమె గత నెల 17న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని సీఐ చెప్పారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిందని, ఎక్కడ వెదికినా కనిపించకపోవడంతో ఆమె భర్త ఫిర్యాదు చేశాడని తెలిపారు.

నివాళి



నర్సంపేట : మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు మావో చిత్రపటానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, నాయకులు మంగళవారం నివాళులర్పించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మావో 49వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. మావో ఆలోచనా విధానంతోనే దేశానికి విముక్తి లభిస్తుందని తెలిపారు. హక్కుల సాధన కోసం మావో స్ఫూర్తితో ప్రజలు సంఘటితంగా ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గట్టి కృష్ణ, భోగి సారంగపాణి, మల్లన్న, భద్రాజి, గౌర్రె ప్రదీప్, ఆకుల వెంకటస్వామి, పూలక్క, ఆకుతోట రాజు, సాంబన్న, పెద్దకాసు మల్లన్న, గొల్లెన అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో..

నర్సంపేట రూరల్ : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నర్సంపేట మండలంలోని మహేశ్వరంలో మావో వర్ధంతి నిర్వహించారు. చొప్పరి పైడి అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాయం చిన్న చంద్రన్న మాట్లాడారు. తొలుత మావో చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అడ్డూరి రాజు, దార లింగయ్య, గడికొప్పు రవి, జవహర్ లాల్, సుధాకర్, సమ్మయ్య, ఇంద్ర, బుచ్చయ్య, సారంగం, సారమ్మ లచ్చమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఫ్లెక్సీల ధ్వంసం

గీసుకొండ : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఫ్లెక్సీలు చించి ఉండడాన్ని ఆ పార్టీ మండల నాయకుడు కోట ప్రమోద్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రమోద్ మాట్లాడారు. ఫ్లెక్సీల ధ్వంసాన్ని ఖండించారు. ఎస్సై కుమార్ ఘటనా స్థలిని సందర్శించారు.

యూనిఫాం.. ఒకే జత

- మూడు స్కూళ్ల విద్యార్థులకే రెండు జతలు

నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో భాగంగా ప్రభుత్వం స్కూళ్లు తెరుచుకున్న రోజే విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫాం అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. విద్యా సంవత్సరం మొదలై మూడు నెలలు పూర్తి కావస్తున్నా మండలంలో ఇప్పటివరకు విద్యార్థులకు పూర్తి స్థాయిలో యూనిఫారాలు పంపిణీ చేయలేదు. మూడు స్కూళ్ల మినహా 44 పాఠశాలల విద్యార్థులకు ఒక జత చొప్పున అందజేశారు. మరో జత కోసం విద్యార్థులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. విద్యార్థులు పాత, చిరిగిన యూనిఫామ్‌తో స్కూళ్లకు హాజరవుతున్నారు.

మండలంలోని 47 ప్రభుత్వ పాఠశాలల్లో 1646 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి రెండు జతల చొప్పున యూనిఫారం అందించాల్సి ఉంది. నల్లబెల్లి హైస్కూల్, కన్నారావుపేట ప్రాథమికోన్నత పాఠశాల, మూడుచెక్కలపల్లి స్కూల్‌లో చదువుకుంటున్న 229 మంది విద్యార్థులకు మాత్రమే రెండు జతల చొప్పున యూనిఫాం అందజేశారు. మిగతా 44 పాఠశాలల్లో చదువుతున్న 1417 మంది విద్యార్థులకు ఇప్పటివరకు ఒక జత చొప్పున మాత్రమే పంపిణీ చేశారు.



యూనిఫాం పంపిణీ చేస్తున్న మదర్ థెరిస్సా మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు (ఫైల్)

రెండో జత ఇంకా అందలే



మాకు రెండో జత యూనిఫాం ఇంకా అందలే. పాతవి, చిరిగినవి వేసుకుని స్కూల్‌కు రావాల్సి వస్తోంది. మరో యూనిఫాం ఇప్పించాలి. అధికారులు స్పందించి చొరవ చూపాలి.

– ఎ.ఈశ్వర్, విద్యార్థి, శనిగరం హైస్కూల్

త్వరలో అందిస్తాం



ఒక జత అందిన అందరికీ త్వరలో రెండో జత అందిస్తాం. మహిళా సంఘం సభ్యులతో కుట్టిస్తున్నాం. కొంత జాప్యం అవుతోంది. మరో జత పంపిణీకి చర్యలు చేపడతాం.

– అనురాధ, ఎంఈఓ

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- వేర్వేరుగా బీఆర్‌ఎస్, బీజేపీ ఆందోళనలు

నల్లబెల్లి : రెవెన్యూ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వాంకుడోత్ కల్పన ఆత్మహత్యయత్నానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం వేర్వేరుగా ఆందోళనలు చేపట్టారు. బీఆర్‌ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, బీజేపీ నాయకులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కల్పన ఆత్మహత్యయత్నానికి ముందు సూసైడ్ నోట్ రాసినా నిందితులపై కేసు నమోదు చేయలేదని, కాంగ్రెస్ నాయకుల వేధింపులే కారణమని ఆరోపించారు. తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సై గోవర్ధన్, కానిస్టేబుల్ వేణు ఆందోళనకారులను శాంతింపజేశారు. ఆర్డీఓ హామీతో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పెద్ది స్వప్న మాట్లాడారు. గిరిజన సామాజికవర్గానికి చెందిన ఉద్యోగి కల్పన సూసైడ్ నోట్‌లో నిందితుల పేర్లు రాసినా కేసు నమోదు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ నాయకుల వేధింపులను పలుమార్లు తహసీల్దార్ దృష్టికి బాధితురాలు తీసుకెళ్లినా పట్టించుకోకపోగా రాజీపడాలని ఒత్తిడి చేయడంతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. తహసీల్దార్‌పైనా, బాధ్యులైన కాంగ్రెస్ నాయకులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ మండల అధ్యక్షులు బానోత్ సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, గందె శ్రీనివాస్, నానబోయిన రాజారాం, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్దిమేడారం సమ్మక్క పూజారి మృతి



సమ్మయ్య (ఫైల్)

నల్లబెల్లి : మండలంలోని గుండ్లపహాడ్ శివారు గాంధీనగర్‌కు చెందిన నాగరాజుపల్లి శివారు మద్దిమేడారం సమ్మక్క తల్లి ప్రధాన పూజారి దురిశెట్టి సమ్మయ్య (85) మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన మృతితో గుండ్లపహాడ్, నారాజుపల్లి గ్రామాల్లో విషాదం నెలకొంది. సమ్మయ్య మృతి పట్ల జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న సంతాపం తెలిపారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూజారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, నాగరాజుపల్లి మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి తదితరులు నివాళులర్పించారు.

13న లోక్ అదాలత్

సంగెం : ఈనెల 13న లోక్ అదాలత్ ఉందని ఎస్సై నరేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు పరస్పరం రాజీపడి కోర్టు ద్వారా కేసులు కొట్టేయించుకోవాలని సూచించారు. కొట్టుకున్న, భూమికి సంబంధించిన, చీటింగ్, తదితర కేసులను ఇరువర్గాలు సామరస్యంగా రాజీ చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదిస్తే కోర్టు ద్వారా కేసులు తీసివేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగగిరి కాంగ్రెస్ గ్రామ కమిటీని పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధన రమేశ్ మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద సోమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చీకటి చిన్న రాజు, ఉపాధ్యక్షులుగా కూరపాటి సదయ్య, కుక్కల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శులుగా తాడెం ప్రభాకర్, కార్యదర్శులుగా పైండ్ల వెంకన్న, అనుముల సుధాకర్, కోశాధికారిగా బుషెల్లి ప్రసాద్, ప్రచార కార్యదర్శులుగా రాకం సురేశ్, సప్పిడి నరేశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీని రమేశ్ అభినందించారు.

హత్యాయత్నం కేసులో నలుగురి రిమాండ్

సంగెం : హత్యాయత్నం కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గాంధీనగర్‌లోని వినాయక మండపం వద్ద అఖిల్ పేరును చెట్టబోయిన లక్ష్మీప్రసన్న డ్రాలో రాయించింది. కాగా డ్రాలో లడ్డూ అఖిల్ పేర రాగా అఖిల్ ఎవరని ప్రశ్నిస్తారనే ఆందోళనతో దండ స్వరాజ్యం ఇంటికి లక్ష్మీప్రసన్న వెళ్లి ఆ పేరు ఆమె రాయించినట్టు ఒప్పుకోమని కోరింది. ఈ క్రమంలో స్వరాజ్యం ఒప్పుకోలేదు. ఈ విషయం తెలిసిపోయిందని స్వరాజ్యం ఇంటికి ప్రసన్నలక్ష్మి తండ్రి రమేశ్, తల్లి రాధిక వెళ్లి తమ కూతురును బద్నామ్ చేస్తున్నావంటూ గొడవ పడ్డారు. ఈ విషయాన్ని కొంకపాకలోని బావమరిది అల్లాడి యాకయ్య, అత్త వీరమ్మ, మారబోయిన అశోక్, శ్వేతలకు తెలిపారు. రమేశ్ ఇంట్లో రమేశ్, రాధిక, లక్ష్మీప్రసన్న, అశోక్, శ్వేత కలుసుకుని యాకయ్య, వీరమ్మలకు ఫోన్ చేయగా వారు వారి బంధువైన మైదం వేణును వెంట తీసుకొచ్చి అంతా కలిసి కర్రలు, ఇనుపరాడ్, కత్తితో స్వరాజ్యం ఇంటిపై దాడి చేశారు. యాకయ్య దాడి చేయడంతో వెంకటేశ్వర్లుకు రక్తస్రావం అయ్యింది. ఇంట్లోకి చొరబడి హత్య చేయడానికి ప్రయత్నించినట్టు ఫిర్యాదు చేయడంతో చెట్టబోయిన రమేశ్, అల్లాడి యాకయ్య, మారపాక అశోక్, మైదం వేణులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మరి కొందరు పరారీలో ఉన్నారని ఎస్సై వివరించారు.

పీహెచ్‌సీని ఉన్నతీకరించాలని వినతి

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ)ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా ఉన్నతీకరించాలని కోరుతూ ఏబీఎస్‌ఎఫ్, స్వేరోస్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏబీఎస్‌ఎఫ్‌జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు రోగాలతో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి స్థానికంగానే మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, రాజు, ప్రమోద్, శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సన్మానం



నర్సంపేట రూరల్ : జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన మండంలోని భాంజీపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు రామేశ్వరిని మండలంలోని మాదన్నపేట స్కూల్ ఆవరణలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాంచంద్రు, ఉపాధ్యాయులు మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం హెచ్‌ఎం రాంచంద్రు మాట్లాడారు. నిబద్ధతతో పని చేస్తే సరైన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ సర్దార్, ఉపాధ్యాయులు ఈదుల వీరస్వామి, కొంగర కవిత, రజిత, కనక రాజు, భిక్షపతి, సంధ్యారాణి, వెంకన్న, అశోక్, స్రవంతి, సంతోశ్, సీఆర్పీ దూపటి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన వళపాక రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనకు ఆర్‌ఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. అలాగే మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన గిరికత్తుల రాములు మృతి చెందగా బాధిత కుటుంబానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ ప్రతినిధులు గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, రాము, యాకూబ్, కేమిడి యాదగిరి, ముత్యం రవి, వంశీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైపై చర్య తీసుకోవాలి

నర్సంపేట : యూరియా కోసం బారులుదీరిన రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించి కొట్టిన చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోనాపురం మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోనాపురంలోని గోదాం వద్ద యూరియా కోసం రైతులు మంగళవారం తెల్లవారుజాము నుంచే బారులుదీరగా క్యూలైన్‌లో ఉన్న రైతు తాండ్ర స్వామి, బాల్‌నాయక్‌తండాకు చెందిన లావుడ్య నర్సింహ, తదితరులను కర్రతో కొట్టాడని తెలిపారు. మహిళా రైతులను సైతం పరుష పదజాలంతో దూషిస్తూ దౌర్జన్యం చేశాడని ఆరోపించారు. ఎస్సై మీద చర్యలు తీసుకోవాలని కోరాడు.

బాలల భద్రతకే 'వెలుగు ప్రయాణం'

ఐనవోలు : బాలల భద్రత, శ్రేయస్సు కోసమే వెలుగు ప్రయాణం కార్యక్రమం చేపట్టినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఒంటి మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో సంస్కార్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, కడియం ఫౌండేషన్ సహకారంతో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సురక్షిత స్పర్శ, పోక్సో చట్టం, ఇంటర్నెట్ వినియోగం, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. సంస్థ స్థాపకులు గణేశ్, మహిమ, గజల్, రాజశేఖర్, సాయికిరణ్, దీక్షిత్‌ను అభినందించారు. హెచ్‌ఎం సదానందం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మోహన్, అశోక్, పూర్ణచందర్, విద్యాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'బీజేపీని కించపర్చడం సరికాదు'

పర్వతగిరి : పర్వతగిరి మండలంలో కొందరు రెండు పడవలపై ప్రయాణం చేసే నాయకులు ఇచ్చిన తప్పుడు సమాచారాలను నమ్మి పెద్ద నాయకులు బీజేపీని కించపర్చడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు నుంచి ఏ ఎన్నికలు వచ్చినా అన్ని వర్గాల ప్రజలు ప్రజలు బీజేపీనే గెలిపిస్తారని తెలిపారు.

వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నర్సంపేట : నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగి కల్పనను వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేశ్ కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన మహిళా ఉద్యోగిపై వేధింపులు దుర్మార్గమన్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుగ్గొండి : నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు



నర్సంపేట : నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీవాణి



ఘనంగా కాళోజీ జయంతి

జిల్లావ్యాప్తంగా మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు, తెలంగాణ భాషా దినోత్సవాలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, ప్రధాన కూడళ్లలో, విద్యాసంస్థల్లో ఆయన చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. కాళోజీ ప్రజా హక్కుల కోసం శ్వాస ఉన్నంత వరకు పరితపించారని కీర్తించారు. తెలంగాణ భాష, యాసకు ఊపిరులూదారని కొనియాడారు. ప్రజాకవిగా కాళోజీ జనానికి అందించిన సేవలను వక్తలు ముక్తకంఠంతో కొనియాడారు. కవిగా కాళోజీ అందించిన స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమించాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్వతగిరి మండలంలో..



రాయపర్తి : నివాళుల్లర్పిస్తున్న తహసీల్దార్



ఖానాపురం : నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ



నల్లబెల్లి : కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ అనురాధ, ఉపాధ్యాయులు

ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలి

- బీజేపీ అధికార ప్రతినిధి మహేందర్‌రెడ్డి

వర్ధన్నపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మహేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని బండౌతాపురంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనతో ప్రజలు మోసపోయారని చెప్పారు. ఈ క్రమంలో ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అములు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో మండల ప్రభారి జలగం రంజిత్, మండల ఎన్నికల కన్వీనర్ రాయపురం కుమారస్వామి, జిల్లా కౌన్సిల్ మెంబర్, మండల కోకన్వీనర్ మైసరాము, మండల ప్రధాన కార్యదర్శులు సిందం శ్రీనివాస్, ఆకోజు సాంబయ్య, మండల కార్యదర్శి శ్రీరాముల సంపత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కర్క సోమిరెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నక్క రవి, నాయకులు అనిల్, విజేందర్, సునిల్, దేవేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కీలకం

- ఎస్‌బీఐ మేనేజర్ మోహన్ కాంత్

నర్సంపేట : బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కీలకమని ఎస్‌బీఐ మేనేజర్ మోహన్ కాంత్ తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని కాల్‌నాయక్‌తండా పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులు, ప్రజలు సంపాదన నుంచి కొంత పొదుపు చేసుకోవడాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. సంపాదన కలిగిన ప్రతిఒక్కరూ పొదుపును అలవర్చుకుంటే ఆర్థికంగా ఉన్నతి సాధించగలరని తెలిపారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గొడిశాల వికాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ మోహన్

పాలకుల నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

- ఎంసీపీఐ(యూ) కార్యదర్శి ఇస్మాయిల్

సంగెం : పాలకుల నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత వచ్చిందని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ఇస్మాయిల్ అన్నారు. మండలంలోని కుంటపల్లిలో గోనె రాంచందర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఇస్మాయిల్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల బస్తా యూరియా కోసం రైతులు రాత్రింబవళ్లు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందకపోతే పంటల దిగుబడి తగ్గి పెట్టుబడి కూడా గిట్టుబాటక కాక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇకనైనా రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రౌతు శ్రీనివాస్, రాజు, జక్క అశోక్, పాపయ్య, ఉప్పలయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇస్మాయిల్

సరిపడా యూరియా ఉంది

నెక్కొండ : మండల రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందిన మండల వ్యవసాయ అధికారి ఎగిడి నాగరాజు తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల రైతులకు సరిపడా యూరియా వచ్చిందని తెలిపారు. ప్రస్తుత వానాకాలానికి సంబంధించి మండలంలోని పీఏసీఎస్ పరిధిలో యూరియా నిల్వలున్నాయని చెప్పారు. నెక్కొండ పీఏసీఎస్ ద్వారా నెక్కొండ, పనికర, పత్తిపాక, పెద్దకొర్పోలు, గంగ్రపల్లి, అప్పల్‌రావుపేటలో, రెడ్లవాడ పరిధిలోని రెడ్లవాడ, గొట్లకొండ, సాయిరెడ్డిపల్లి, బొల్లికొండ, అలంకానిపేట, చంద్రుగొండ, సూరిపల్లి ద్వారా సూరిపల్లి, చిన్నకొర్పోలు, నాగారం రెవెన్యూ గ్రామాల్లోని కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా యూరియా అందిస్తామన్నారు.